
నవభూమి
కరీంనగర్
అనుబంధం
13 నవంబర్,2024 బుధవారం పేజీలు:3
www.epaper.navabhoomi.in



### పొదుపు చర్యలతోనే

# సంస్థ మనుగడ



**గోదావరిఖని: –నవభూమి:** సింగరేణికి వందేళ్లకు పైగా చరిత్ర.. ఒడిదుడుకులు ఎదుర్కొని నిలదొక్కుకున్న అనుభవం..నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఫలించిన పొదుపు ప్రయత్నం.. ఎన్నో ప్రభుత్వ రంగ పరిశ్రమలకే ఆదర్శంగా నిలిచింది. ప్రస్తుతం సంస్థ మళ్లీ నాటి దుస్థితిలోకే వెళుతోందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఉత్పాదకత పెంపు.. ఉత్పత్తి వ్యయం తగ్గించాలని ఓవైపు చెబుతున్న యాజమాన్యం మరోవైపు దుబారా ఖర్చులను పెంచుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తి వ్యయం భారీగా పెరుగుతుందని ఆందోళన చెందుతున్న సింగరేణి దానిని అదుపు చేసేందుకు ఖర్చులు తగ్గించుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.నిలదొక్కుకుందిలా సింగరేణి సంస్థ 1995, 1996లో భారీ నష్టాలను చవిచూసింది. రూ.1216 కోట్ల నష్టాలతో బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లింది. ఖాయిలా పరిశ్రమ కింద ప్రకటించే స్థాయికి చేరుకుంది. తక్షణం నష్టనివారణ చర్యలు చేపట్టింది. 2003 నుంచి లాభాల్లోకి అడుగుపెట్టింది. అందుకు తీసుకున్న సంస్కరణలే కారణమని సీనియర్ కార్మికులు చెబుతున్నారు. దుబారా వ్యయం తగ్గించుకొని కార్మికుల్లో పని విధానాన్ని పెంచింది. అదనపు ఓటీలు లేకుండా చేసి అవసరం మేరకే యంత్రాలు కొనుగోలు చేసింది. సమ్మెలకు దూరంగా ఉంటూ బొగ్గు ఉత్పత్తిని క్రమక్రమంగా పెంచేలా కార్యాచరణ చేపట్టింది. వినియోగదారుల నుంచి పూర్తి విశ్వాసాన్ని పొందే విధంగా సకాలంలో బొగ్గు సరఫరా చేసింది. బొగ్గు సరఫరా ఒప్పందం ద్వారా కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. సకాలంలో బొగ్గు సరఫరా చేయకపోయినా, నాణ్యతలో లోపం ఉన్నా డబ్బులు తిరిగి చెల్లిస్తామని వినియోగదారులతో అంగీకారం కుదుర్చుకుంది. కార్మికుల్లో చైతన్యం తీసువచ్చేందుకు సంస్థ స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించింది.దిద్దుబాటు చర్యలు చేపడితే మేలు తెలంగాణ ప్రాంతంలో ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సింగరేణి దిద్దుబాటు చర్యలు చేపడితేనే భవిష్యత్తులో మరింత కాలం ఉనికి చాటుకునే అవకాశం ఉంది. లోపాలను సవరించుకుంటూ దుబారాను నియంత్రిస్తూ ముందుకు సాగితే ఎంతో మందికి ఊతమివ్వడమే కాకుండా పరిశ్రమ మనుగడ మరింత కాలం ఉండే అవకాశం ఉంటుంది.దుబారా ఇలా సింగరేణి సంస్థ ఇటీవల సహపంక్తి భోజనాల పేరుతో రూ.10 కోట్ల వరకు వెచ్చించిందని పలువురు ఆరోపిస్తున్నారు.పోటీపరీక్ష రాసిన 135 మంది అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున అందజేత.ప్రభుత్వ కార్యక్రమాలకు సింగరేణి నిధులతో ఏర్పాట్లు ప్రతినిధుల విదేశీ పర్యటనలకు భారీ మొత్తంలో ఖర్చు. ఇతర ప్రాంతాలకు అభివృద్ధి నిధులు.కార్మికులకు సంస్థ ఇచ్చే సూచనలు కంపెనీ మనుగడ ఉండాలంటే పని గంటలు సద్వినియోగం చేసుకోవాలి.ఉత్పాదకత పెంచుకోవాలి. ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవాలి.ఉపరితల గనుల్లో యంత్రాలు రోజుకు కనీసం 20 గంటలు పనిచేయాలి.భూగర్భ బొగ్గుగనుల్లో ప్రతి టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.10 ఖర్చు అవుతుంది.భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాలు రోజుకు 8 గంటలు పనిచేస్తున్నాయి. కనీసం 14 గంటలు పనిచేయాలి.ఉద్యోగుల పని విధానంలో మార్పు రావాలి. నైపుణ్యం పెంచుకోవాలి. భూగర్భ గనుల ద్వారా సంస్థకు నష్టం వస్తుంది.ప్రస్తుతం చేస్తున్న ఉత్పత్తి కంటే 40 శాతం అదనంగా చేయాలి.మార్కెట్‌లో పోటీని తట్టుకోవాలంటే ఉద్యోగులు మరింత కష్టపడి పనిచేయాలి.ప్రభుత్వ జోక్యం ఎక్కువైంది వి.సీతారామయ్య, గుర్తింపు సంఘం అధ్యక్షులు సింగరేణిలో దుబారా పెరిగిపోయింది. ప్రభుత్వం జోక్యం ఎక్కువైంది. సంస్థ నష్టాల బాటలోకి వెళ్లే పరిస్థితులు ఎదురవుతున్నాయి. సంస్థకు సంబంధం లేని అంశాలపై అనవసరంగా ఖర్చు చేస్తోంది. రానున్న కాలంలో ఇదే విధంగా ఉంటే కంపెనీ మనుగడ కష్టమే. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సింగరేణి ఎంతో మందికి ఉపాధి కల్పించింది. మితిమీరిన ప్రభుత్వ జోక్యంతో మళ్లీ నష్టాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇదే విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకువెళుతున్నా పట్టించుకోవడం లేదు.

### మాజీ సర్పంచుల కలెక్టరేట్

# ముట్టడి ఉద్రిక్తం



**సిరిసిల్ల –నవభూమి:** గ్రామాల్లో చేపట్టి న అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాజీ సర్పంచుల ఫోరం జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రికత్తకు దారి తీసింది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని శాంతియుతంగా నెలరోజులు రిలే దీక్షలు, ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మాజీ సర్పంచులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. 2019 నుంచి 2024 వరకు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. రగుడు జంక్షన్ నుంచి ర్యాలీగా తరలిరావడంతో కలెక్టరేట్ ఎదుట పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలుస్తామంటూ దూసుకెళు ్తండగా పోలీసులు అడ్డుకున్నారు. వినిపించుకోకుండా కలెక్టరేట్‌లోకి పరుగు తీయడంతో పోలీసులు గేట్‌లను మూసివేశారు. ఆగ్రహించిన మాజీ సర్పంచ్‌లు అక్కడే బైఠాయించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ కృష్ణ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతుండగానే కొందరు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని మాజీ సర్పంచ్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లను పోలీసు వాహనాల్లో కలెక్టరేట్‌లోకి తీసుకురాగా వారు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అంజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతు వేదికలు, శశ్మాన వాటికలు, డంపింగ్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు, మిషన్‌భగరీథ పనులు, సీసీ రోడ్లు, మురికికాలువలతోపాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాలేదని, వాటికోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపా?ధ్యక్షులు గణప శివజ్యోతి, చాకలి రమేష్, బోజ్జం మల్లేశం, కోల నర్సయ్య, వంశీకృష్ణరావు, గున్నాల లక్ష్మణ్, చల్లనారాయణ, బూర్గుల నందయ్య, పోన్నాల మల్లారెడ్డి పాల్గొన్నారు.కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచులు పెండింగ్ బిల్లుల కోసం ఆందోళనలు చేస్తుండడంతో పోలీసులు గేట్లను మూసివేశారు. కలెక్టరేట్‌లో ప్రజావాణిలో పాల్గొనేందుకు వచ్చిన జిల్లా అ?ధికారులతో పాటు ప్రజలను అనుమతించక పోవడంతో ఇబ్బందులకు గురయ్యారు. మాజీ సర్పంచ్‌ల ను అరెస్ట్ చేసిన అనంతరం జిల్లా అధికారుల ఐడీ కార్డులను చూసి పంపించారు. దీంతో అధికారులతో పాటు ప్రజలు గంటల తరబడి నిరీక్షించారు.

# తగ్గని జ్వరాలు పెరుగుతున్నబాధితులు



## 100 శాతానికి సన్నద్ధం



**జగిత్యాల –నవభూమి:** జగిత్యాల ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు.ఈ మేరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టేందుకు విద్యాశాఖ సమాయత్తమైంది. ఇందులో భాగంగా నవంబరు 4 నుంచి విద్యార్థులకు ఒక గంట ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ జిల్లాలో పదో తరగతి విద్యార్థులపై పలు సమస్యలు ప్రభావితం చూపనున్నాయి. జిల్లాలో మొత్తం 233 ప్రభుత్వ, ఆదర్శ, గురుకుల, కస్తూర్బా పాఠశాలలున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 7635 పదో తరగతి విద్యార్థులున్నారు. మార్చిలో నిర్వహించే పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు.వెంటాడుతున్న సమస్యలు..ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ కొలిక్కి రావడంతో 98 శాతం సబ్జెక్టుపరంగా ఎలాంటి ఇబ్బందులు లేవు. కానీ ఈసారి పార్ట్–2 పాఠ్య పుస్తకాలు ఆలస్యంగా పంపిణీ కావడంతో చాలాచోట్ల పాఠ్య ప్రణాళిక వెనుకబడింది. డిసెంబరు వరకు సిలబస్ పూర్తికి ఉపాధ్యాయులకు లక్ష్యం నిర్ణయించకున్నా అది పూర్తయ్యే అవకాశం లేదు. జనవరి వరకు సిలబస్ కొనసాగనుంది. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల హాజరుశాతం కూడా కలవరపెడుతోంది. ఇటీవల తీవ్రమైన జ్వరాలు, ఇతర అనారోగ్య కారణాలతోపాటు పలు పాఠశాలల్లో విద్యార్థులు పాఠశాలకు రావడంలేదు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే స్వయంగా పిల్లల ఇంటికి వెళ్లి కారణాలు కనుక్కొని వారిని బడికి పంపాలని కోరుతున్నా హాజరుశాతంలో మార్పు రావడంలేదు.జిల్లా విద్యాశాఖ పూర్వ ఫలితాలను తిరిగి పొందాలని భావిస్తోంది. 2017లో 97.35 శాతం, 2018లో 97.56, 2019లో 99.73, 2020లో 99.98 ఫలితాలు సాధించగా కరోనా నేపథ్యంలో 2021లో వందశాతం ఫలితాలు వచ్చాయి. 2022లో 91.37, 2023లో 84.05, 2024లో 95.76 శాతం ఫలితాలు నమోదయ్యాయి. ఈసారి శతశాతం ఫలితాలు సాధించే దిశగా విద్యాశాఖ సమాయత్తమవుతోంది.

## విక్రయించాలా.. వేచి ఉండాలా...!

**జగిత్యాల –నవభూమి:** జిల్లాలో సన్నధాన్యం పండించిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ప్రభుత్వం సన్నధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామనగా నిరుటికన్నా రెండింతల అధిక విస్తీర్ణంలో సన్నవరి సాగుచేశారు. ప్రస్తుతం ఆశించినట్లుగా సన్నవడ్ల కొనుగోలు జరగకపోవటం, ప్రైవేటుగా ధరలు తగ్గటంతో రైతులు అయోమయంలో పడ్డారు.జిల్లాలో వానాకాలంలో రికార్డుస్థాయిలో 3.16 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేయగా ఇందులో లక్ష ఎకరాల్లో సన్నగింజ రకాలున్నాయి. ప్రభుత్వ మద్దతు మేరకు క్వింటాలుకు సాధారణ రకాలకు రూ.2,300, ఫైన్ రకాలకు రూ.2,320 చొప్పున దొడ్డురకాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం సూచించిన 33 రకాల సన్నగింజ రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామనటంతో జేజీఎల్, కూనారం, వరంగల్, ఆర్ఎన్ఆర్ తదితర సన్నగింజ రకాలను రైతులు పండించారు. గతేడాది జేజీఎల్, ఆర్ఎన్ఆర్ తదితర రకాలకు క్వింటాలుకు రూ.2,700 పైబడి ధరలు పలకగా ప్రస్తుతం రూ.2,200 స్థాయిలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఈ రకాలను కొనుగోలుచేస్తే క్వింటాలుకు రూ.2,820 చొప్పున రైతులకు ధర దక్కుతుంది.మిల్లుల కేటాయింపుగతేడాది ఇదే సమయానికి జైశ్రీరాం రకానికి క్వింటాలుకు రూ.3,300 ధర పలకగా ప్రస్తుతం రూ.2,650 దిగువనే ఉన్నాయి. బీపీటీ, హెచ్ఎంటీ తదితర రకాలకు రూ.2,450లోపే ధరలుండటంతో రైతులు అయోమయంలో పడ్డారు. జైశ్రీరాం వంటి అతిసన్నగింజ కలిగిన రకాలకు కనీసం రూ.3 వేలకు పైబడి ధరుంటేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. మరోవైపు జిల్లాలో ధాన్యం సేకరణకు 425 ప్యాక్స్, ఐకేపీ, మెప్మా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 65 కేంద్రాల ద్వారా సన్నగింజ రకాలను తీసుకోవాలని నిర్ణయించారు. సన్నరకాలకు ఇప్పటివరకు 3 మిల్లులను కేటాయించగా ఏఈవో వడ్లను ధ్రువీకరించటం, ఒక లారీ నిండితేనే మిల్లుకు పంపుతామనటం, మిల్లర్లకు కూడా ప్రభుత్వం నుంచి సరైన స్పష్టత లేదని కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటూ ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ కొనుగోలుపై అనుమానంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు పెద్దఎత్తున ధాన్యాన్ని విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

# తగ్గని జ్వరాలు పెరుగుతున్నబాధితులు

**సిరిసిల్ల –నవభూమి:** జిల్లాలో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.ముఖ్యంగా జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోజూ వందల సంఖ్యలో జ్వర బాధితులు వస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు రావడంతో రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఇందుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి వస్తున్న రోగులే నిదర్శనం.శీతాకాలం వచ్చిన తర్వాత ఆసుపత్రిలో రోజూ 600 నుంచి 1000 పైగా ఓపీ నమోదవుతుంది.ఎక్కువగా జ్వరాలతో బాధపడుతున్నవారే ఉంటున్నారు. డెంగీ వంటి వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్నారు. ఆగస్టులో 42 డెంగీ కేసులు నమోదయ్యాయి.రోజూ జ్వరం, దగ్గు, జలుబు, మోకాళ్ల నొప్పులతో బాధపడేవారు వస్తున్నారు.ఆసుపత్రిలో దాదాపు 40 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఎప్పటికప్పుడు వివిధ వార్డుల్లో పర్యవేక్షిస్తున్నారు.స్టాఫ్‌నర్స్, ఇతర సిబ్బంది 150 మంది పైగా ఉన్నారు.వర్షాకాలం ప్రారంభ సమయంలో జిల్లాలో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ప్రజలకు కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రస్తుతం దోమలు బాగా పెరిగి దోమకాటుకు గురికావడంతో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది. దీంతో అధికారులు స్పందించి రసాయనాలు పిచికారీ చేయించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.మందుల కేంద్రం వద్ద .మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం డాక్టర్ లక్ష్మీనారాయణ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ జిల్లా ఆసుపత్రిలో ఓపీ అధికంగానే ఉంటుంది. రద్దీకి అనుగుణంగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశాం. దాదాపు 40 మంది వైద్యులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం.





# పర్యాటకం..విద్యార్థుల అధ్యయనం

**కరీంనగర్ –నవభూమి:** కరీంనగర్‌లోని గాంధీ సెంటినరీ మ్యూజియం వద్ద క్లబ్ కోఆర్డినేటర్ సుధాకర్, విద్యార్థులు' ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేసింది. యువతను పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వీటిలో చేరే వారిని సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని కళాశాలల విద్యార్థులు పర్యటించి రాగా.. మరికొన్ని కళాశాలల వారు పర్యటించేందుకు ప్రణాళికలు రచించుకున్నారు.అన్ని డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో యువ పర్యాటక క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. క్లబ్‌కు ప్రిన్సిపల్ అధ్యక్షుడిగా, అధ్యాపకులు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. కళాశాలల్లో ఆయా గ్రూప్‌లకు సంబంధించిన విద్యార్థులు 20 మంది వరకు సభ్యులుగా ఉంటారు. ఏడాదికోసారి వేర్వేరు పర్యాటక ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. ఆయా కళాశాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుంటాయి. క్లబ్‌ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిమిత్తం జిల్లాల డీఆర్వోలకు ప్రత్యేకంగా లింకు పంపించారు.నిర్వహించే కార్యక్రమాలు...దర్శనీయ ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తారు. చారిత్రక వారసత్వ ప్రాంతాల ప్రాధాన్యంపై ప్రచారం చేస్తారు. పట్టణాలు, గ్రామాలకు సమీపంలో ఉన్న పర్యాటక క్షేత్రాల వరకు ట్రెక్కింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, లోగో డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు పెడతారు.ఇటీవల కరీంనగర్ ఎస్సారార్ కళాశాలల విద్యార్థులు పెద్దపల్లి జిల్లా ధూళికట్టలోని బౌద్ధ స్తూపం, కోటిలింగాల తదితర పర్యాటక ప్రాంతాలను సందర్శించి వచ్చారు.ఉమ్మడి జిల్లాలో చూడదగిన చారిత్రక ప్రాంతాలు దేశంలోనే పేరొందిన సిల్వర్ ఫిలిగ్రీతోపాటు నల్ల బంగారంగా పిలుచుకునే సింగరేణి గనులకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రసిద్ధి. వెలుగులు విరజిమ్మే రామగుండం ఎన్టీపీసీ, రాముడు నడయాడిన నేల రామగిరిఖిల్లా, ఎలగందుల కోట, జగిత్యాల ఖిల్లా, బౌద్ధ స్తూపం ధూళికట్ట, వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాల.. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదులు సంగమించే త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం.. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం, రామలింగేశ్వరాలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, కొండలరాయుడి కోట, బొజ్జ పోతన, సీతమ్మవారి కన్నీటి గుంటలు ఈ ప్రాంతంలో చూడదగినవి.ప్రధాన ఉద్దేశాలు.. లక్ష్యాలు పర్యాటక ప్రాధాన్యం, దేశంలోని భిన్న సంస్కృతులు, భౌగోళికం, సంప్రదాయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం.పర్యాటక క్లబ్‌లో పాల్గొన్న విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం. బాధ్యతాయుతమైన పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటంతో విద్యార్థులను సాంస్కృతిక రాయబారులుగా తయారు చేయడం.జీవన స్థితిగతులు తెలుస్తాయి సుధాకర్, యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్, ఎస్సారార్ కళాశాల చారిత్రక, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో విద్యార్థులను భాగస్వాములుగా చేసి దేశ సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దటం పర్యాటక క్లబ్‌ల ముఖ్య ఉద్దేశం. వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేయడంతో.. అక్కడి పరిస్థితులు, ప్రజల జీవన స్థితిగతులు తెలుసుకోవచ్చు. యాత్రలు, అనుభూతులను కథలు, షార్ట్‌ఫిల్మ్‌గా మలిచే అవకాశం ఏర్పడుతుంది. పర్యాటకులకు గైడ్‌గా పని చేసి ఉపాధి పొందే అవకాశముంది.





## నల్లా బిల్లు..మారని తీరు



**కరీంనగర్–నవభూమి:** ఆస్తిపన్ను తరహాలోనే నల్లా బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించుకోవడానికి వీలుగా అయిదేళ్ల కిందట ఆన్‌లైన్ చేశారు. ఆ సమయంలో ఇంటినంబర్ల ఆధారంగా నల్లా కనెక్షన్ల వివరాలను పొందుపర్చగా ఆ తర్వాత కొందరికి బకాయిలు లేకున్నా.. బకాయిలు ఉన్నట్లుగా చూపిస్తుండటం అసలు సమస్యకు కారణంగా మారింది. దీనిని సవరించాలని దరఖాస్తులు చేసినా ఇప్పటికి పరిష్కారం మాత్రం కావడం లేదు. ఏళ్లుగా సమస్య జిల్లాలోని కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీల్లో నల్లా బిల్లులు క్రమం తప్పకుండా వసూలు చేసుకోవడానికి కుళాయి కనెక్షన్లు ఆన్‌లైన్ చేశారు. ప్రతీ సంవత్సరం బిల్లులు చెల్లించిన వారి వివరాలు సక్రమంగానే ఉండగా, పాత బకాయిలు, నల్లా కనెక్షన్ల వివరాలు లేనివి ఏవీ కూడా అందుబాటులో లేకపోవడంతో ఇంటినంబర్‌పై నల్లా కనెక్షన్ నంబర్ నమోదు చేసి ఎప్పటినుంచి ఆన్‌లైన్ చేస్తున్నారో అప్పటి నుంచి బకాయిలు ఉన్నాయని చూపించడంతో పలువురు ఇంటి యజమానులు ఆందోళనకు గురయ్యారు. వీటన్నింటిని పరిష్కరించేందుకు నలుగురు ఆపరేటర్లను నియమించినప్పటికి ఏ కార్యక్రమం ముందుకొస్తే ఆ కార్యక్రమాలకు వీరిని పంపిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్, భువన్ సర్వే, ప్రస్తుతం కుల గణన సర్వేకు ఆన్‌లైన్ చేయడానికి వినియోగిస్తుండటంతో ఏళ్ల తరబడి నలుగుతున్న సమస్య అలాగే మూలన పడుతుంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా..నగరంలో సుమారు 25 వేల నల్లా కనెక్షన్లకు సంబంధించిన బిల్లులలో భారీ తేడాలున్నట్లు తెలిసింది. ఇంటినంబర్ల ఆధారంగా నల్లా బిల్లు చెల్లించడానికి ముందుకొస్తే పాత బకాయిలు చూపిస్తున్నాయి. తాము క్రమం తప్పకుండా చెల్లిస్తుండగా ఇదేం లొల్లి అంటూ ఆగ్రహిస్తున్నారు. పాస్‌పుస్తకంలో రసీదు నంబర్‌తో సహా రాయగా ప్రస్తుతం ఆ రసీదు తీసుకురావాలని డిమాండ్ చేయడంతో సిబ్బంది తీరుపై మండిపడుతున్నారు. బల్దియా తప్పులకు తాము ఎలా బాధ్యత వహిస్తామంటూ నిలదీస్తున్నారు. ఇలా వందల సంఖ్యలో అర్జీలు ఇవ్వగా వీటన్నింటిని తిరిగి ఆన్‌లైన్‌లో పొందుపర్చి తొలగించాల్సి ఉంటుంది. రెండేళ్లుగా ఈ ప్రక్రియ అలాగే ఉండగా వినియోగదారులు మాత్రం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదు. నలుగురు లాగిన్లతోనే పరిష్కారం ఆన్‌లైన్‌లో నమోదు కానివి, తప్పుడుగా నమోదైన బిల్లులు, మార్పులు, చేర్పులు చేయాలంటే అనుమతులు తప్పనిసరి. ప్రధానంగా ఎక్కువ, తక్కువ బిల్లుల సవరణకు దరఖాస్తుతో పాటు రసీదులు నిక్షిప్తం చేయాలి. దీనికి సెక్షన్ క్లర్కు నుంచి క్యాషియర్, క్యాషియర్ నుంచి ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈకి, ఎస్ఈ నుంచి కమిషనర్‌కు లాగిన్ కావాల్సి ఉంటుంది. కమిషనర్ లాగిన్ సమయంలో ఓటీపీ అవసరముంటుంది. నలుగురు లాగిన్లు కావాలంటే ఎన్నాళ్లు పడుతుందో అధికారులే తేల్చాల్సి ఉంటుంది. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఇంజినీరింగ్ అధికారి ఒకరు తెలిపారు.

## లస్కర్ల నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా

**హుజూరాబాద్ –నవభూమి:** పంట కాలువలకు నీటిని విడుదల చేయడం, అవసరం లేని చోట షట్టర్లు మూసివేయడం, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడటం, క్షేత్రస్థాయి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో లస్కర్ల పర్యవేక్షణ కీలకం. వారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాల వారీగా ఎంతమంది లస్కర్లు అవసరమున్నారనే విషయంపై నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. త్వరలోనే మార్గదర్శకాలు జారీ కానున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 389 మంది..ఎస్సారెస్పీ కాలువలు నిర్మించిన సమయంలోనే లస్కర్ల పోస్టులు భర్తీ చేశారు. అప్పట్లో నియమించిన వారంతా ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత నియామకాలు చేపట్టకపోవడంతో కాలువల పర్యవేక్షణ, సాగునీటి సరఫరాను పర్యవేక్షించేవారు కరవయ్యారు. ఆయకట్టు రైతులే కాలువల నుంచి నీటిని విడుదల చేసుకోవాల్సి రావడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో డిస్ట్రిబ్యూటరీ కాలువలు 475 కిలోమీటర్లు, పంట కాలువలు 1,541 కిలోమీటర్లు పొడవునా ఉండగా 5.53 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గత ప్రభుత్వం వీఆర్ఏలను క్రమబద్ధీకరించి నీటిపారుదల శాఖలో లస్కర్లుగా నియమించింది. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 89 మంది, జగిత్యాలలో 140, పెద్దపల్లిలో 160 పోస్టులు మంజూరవగా నియామక ప్రక్రియ కోసం జిల్లాస్థాయిలో ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

### సామగ్రి ఇలా...భూసారం

# తెలిసేది ఎలా?






**వేములవాడ:–నవభూమి:** వేములవాడలోని భూసార పరీక్ష కేంద్రం ఏళ్లుగా మూతపడి ఉంది. ఈ ప్రాంత రైతులకు భూసార పరీక్షలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో వేములవాడలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 1998 సంవత్సరంలో భూసార పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించారు. కొంత కాలం బాగానే సేవలందించారు. అయితే ఇక్కడ పని చేసే సిబ్బంది బదిలీపై వెళ్లడంతో 12 ఏళ్లుగా తెరచుకోలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడక ముందు సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల రైతులకు భూసార పరీక్షలు ఈ కేంద్రంలోనే చేసేవారు. క్రమంగా ఈ భూసార పరీక్ష కేంద్రంలోని ఏవో, సిబ్బంది బదిలీపై వెళ్లడం, తిరిగి నియమించకపోవడంతో ఏకంగా మూతపడింది. అందులోని పరీక్ష సామగ్రి పనికి రాకుండా పోయింది. పన్నెండేళ్లుగా మూతపడి ఉన్నా తిరిగి తెరిపించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు భూసార పరీక్షలకు ఇబ్బందులు పడుతున్నారు. అట్ట పెట్టెల్లోనే...భూసార పరీక్ష కేంద్రం మూత పడటంతో అందులోని పరీక్ష సామగ్రి మొత్తం పాడైంది. ఈ కేంద్రాన్ని తెరిపించేందుకు పదేళ్ల క్రితం మట్టి పరీక్షలకు అవసరమైన దాదాపు రూ.5 లక్షల విలువ చేసే సామగ్రిని ప్రభుత్వం అందజేసింది. ఇవన్నీ అప్పటి నుంచి ఇప్పటి వరకు అట్ట పెట్టెల్లోనే మూలుగుతున్నాయి. ఈ కేంద్రాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రజాప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మినీ కిట్లు ఇలా...జిల్లాలోని మండలాలకు క్లస్టర్ల వారీగా ప్రభుత్వం 2017లో భూసార కిట్లను సరఫరా చేసింది. మినీ భూసార పరీక్ష కిట్లు ఏడాది తిరగక ముందే మూలనపడ్డాయి. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు రైతుల పంట క్షేత్రాల్లో మట్టి నమూనాలను సేకరించి చేసిన పరీక్షల ఫలితాలను రైతులకు అందజేశారు. ఆ తరవాత ఈ కిట్లు పనికి రాకుండా పోయాయి. అప్పటి నుంచి తిరిగి ప్రభుత్వం ఇవ్వలేదు. వేములవాడలో మూతపడిన భూసార పరీక్ష కేంద్రం నమూనాలన్నీ కరీంనగర్ కేంద్రానికే..జిల్లాలోని రైతులకు సంబంధించిన మట్టి నమూనాలను సేకరించిన వ్యవసాయశాఖ అధికారులు కరీంనగర్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కేవలం కరీంనగర్‌లోనే ఉండటంతో రైతులంతా అక్కడికే పంపించాల్సిన పరిస్థితి ఉంది. అక్కడ పరీక్షలు చేసి ఫలితాలు వెల్లడి కావడానికి జాప్యం జరుగుతుంది. దీంతో రైతులకు సకాలంలో భూసార పరీక్ష ఫలితాలు అందని దుస్థితి ఏర్పడింది. ఇవీ ప్రయోజనాలు...భూసార పరీక్షలతో రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. పంట క్షేత్రాల్లోని మట్టిని సేకరించి భూసార పరీక్ష చేయించిన తరవాత ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంది. పంట క్షేత్రంలోని మట్టిలో ఎంత మోతాదులో భాస్వరం, నత్రజని, పొటాష్, సూక్ష్మ పోషకాలు ఉన్నాయనే విషయం వెల్లడవుతుంది. ఆ ఫలితాలను బట్టి పంటల మార్పు, సాగుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూసార పరీక్ష కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే నివేదిక పంపించాం సాయికిరణ్, ఏఈవో, వేములవాడ భూసార పరీక్ష కేంద్రానికి సంబంధించిన నివేదికను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. భూసార కేంద్రం పని చేయాలంటే ఒక ఏవో, సిబ్బంది, వసతులు అవసరం. ప్రస్తుతం మట్టి నమూనాలను కరీంనగర్‌లోని కేంద్రానికి పంపిస్తున్నాం.

# మూడేళ్లుగా ఎదురుచూపులే



**కరీంనగర్: –నవభూమి:** కరీంనగర్ కొత్త కలెక్టరేట్‌లో ఉద్యోగులు కొలువుదీరడమనేది కలగానే మారుతోంది. ప్రారంభం ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూడటమే నిత్యకృత్యమవుతోంది. కాలం వెనక్కి పోతున్నా.. కొత్త సముదాయ భవనపు నిర్మాణం మాత్రం ముందుకు సాగడం లేదు. పక్కాగా పర్యవేక్షణ లేకపోవడంతో రేపు మాపు అనే పంథాలోనే కాలయాపన జరుగుతోంది. జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ భవనం పనులు ఒక పట్టాన కొలిక్కి రావడం లేదు. నిర్ణీత గడువులు పలుమార్లు ముగిసిపోయినా.. ప్రారంభోత్సవ తరుణం మాత్రం ఇంకా సమీపించడం లేదు. రూ.51 కోట్ల వ్యయంతో ఆధునిక వసతులు కల్పిస్తూ దీన్ని నిర్మాణం చేపడుతున్నారు. బిల్లులు సకాలంలో అందకపోవడంతో పురోగతి విషయంలో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. 2021 డిసెంబరు 19వ తేదీన ఇక్కడి పనుల కోసం భూమి పూజను చేపట్టారు. దాదాపుగా మూడేళ్ల గడువు సమీపించినా.. ఇప్పటికీ ఇంకా 20శాతం పని చేపట్టాల్సి ఉంది. పక్కన జిల్లాలైన పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాలలో సమీకృత కలెక్టరేట్‌లో సేవలు అందుబాటులోకి వచ్చినా.. ఇక్కడ మాత్రం ఆ అదృష్టం దక్కడంలేదు. సేవలకు తిప్పలు..కొత్త కలెక్టరేట్‌ను నిర్మించే క్రమంలో ప్రస్తుతమున్న పాత కలెక్టరేట్ భవనాన్ని రెండేళ్ల కిందట సగానికిపైగా కూల్చేశారు. కలెక్టరు, అదనపు కలెక్టరు కార్యాలయాలతోపాటు సమావేశ మందిరం, రెవెన్యూ విభాగంలోని పలు సెక్షన్‌లు పాత భవనంలో కొనసాగుతున్నాయి. మిగతా శాఖలకు చెందిన కార్యాలయాలన్నీ కరీంనగర్‌లోని పలుచోట్ల తాత్కాలికంగా సర్దుబాటు చేసుకునేలా ఏర్పాటు చేసుకున్నారు. దాదాపుగా 48 విభాగాల కార్యాలయాలు కొన్ని అద్దె భవనాల్లో.. ఇంకొన్ని ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేసుకొని సేవలందిస్తున్నారు. ఏ కార్యాలయం ఎక్కడ ఉందనేది ఇప్పటికీ ఉన్నతాధికారులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో వివిధ పనుల కోసం ఇక్కడికి వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫలానా కార్యాలయం ఎక్కడ ఉందనేది చెప్పడం కూడా సిబ్బందికి కష్టసాధ్యమైన పనిగా మారింది. పైగా కార్యాలయాలు చెట్టుకొకటి, పుట్టకొకటి అనేలా వేర్వేరు చోట్ల ఉండటంతో పర్యవేక్షణ కరవైంది. ఏ అధికారి, ఉద్యోగులు ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళ్తారోననేది అంతుచిక్కని సమస్యగా మారింది. అదే కొత్తగా ఏర్పాటవుతున్న కలెక్టరేట్‌ను ఈపాటికే నిర్మింపజేసి ప్రారంభించి ఉంటే అన్ని విభాగాలు ఒకే చోట ఉండి.. ప్రజావాణికి వచ్చేవారితోపాటు వివిధ అవసరాల కోసం వచ్చే వారికి అన్ని శాఖల ఉన్నతాధికారులు అందుబాటులో ఉండే అవకాశముంటుంది. ఈ ఇబ్బందిని తీర్చడానికైనా వీలైనంత తొందరగా కొత్త భవనాన్ని ప్రారంభించాల్సిన అవసరముంది.